సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ముమ్మరంగా..
ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



రైతుల కష్టం నీటిపాలు
ఉమ్మడి జిల్లాలో కురిసిన అకాల వర్షంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.5 /41.7

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరి



మహబూబ్‌నగర్ క్రైం: అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో సిబ్బంది స్మారక కవాతు నిర్వహించగా.. అగ్నిమాపక జెండాను ఎగురవేశారు. 1944లో ముంబాయిలో జరిగిన పేలుడులో ప్రాణాలు కోల్పోయిన 66మంది అగ్నిమాపక సిబ్బందికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్‌ను విశ్రాంత అగ్నిమాపక శాఖ అధికారులతో పాటు డీఎఫ్‌ఓ కిషోర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి మల్లిఖార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని 11 కేవీ వెంకటేశ్వరకాలనీ ఫీడర్ పరిధిలో చెట్ల కొట్టివేత కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ టౌన్–3 ఏఈ అరుణ్ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

డిగ్రీ కళాశాలలోనే ఎన్నికల సామగ్రి

- గదుల కొరతతో అవస్థలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న ఎన్నికల సామగ్రిని తరలించకపోవడంతో గదుల కొరత ఏర్పడింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సామగ్రి, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కళాశాలలో ఏర్పాటుచేశారు. ఎన్నికలు ముగిశాక ఈవీఎంలను జిల్లా కేంద్రానికి తరలించగా.. ఇతర సామగ్రి మొత్తాన్ని కళాశాలలోనే నిల్వ చేశారు. ఇందు కోసం ఫిజికల్ డైరెక్టర్ గదులు రెండింటిని వినియోగిస్తున్నారు. ఈ కారణంగా ఫిజికల్ డైరెక్టర్ గదిని మరోచోట ఏర్పాటు చేసుకోవాల్సివచ్చింది. 2023 డిసెంబర్ నుంచి ఎన్నికల సామగ్రిని తరలించి తమకు గదులు అప్పగించాలని కళాశాల ప్రిన్సిపాల్ పలుమార్లు అధికారులు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిసింది. అయితే ఆ సామగ్రిని ఎక్కడికి తరలించాలో తెలియక అధికారులు మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోసం కళాశాల గదులను ఇస్తే.. వాటిని 16 నెలలుగా తమకు అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదని అధ్యాపక బృందం వాపోతోంది. ఇప్పటికైనా ఎన్నికల సామగ్రిని తరలించాలని ప్రిన్సిపాల్ డా. సుకన్య కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ నర్సింగ్‌రావును వివరణ కోరగా.. ఎన్నికల సామగ్రి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తరలిస్తామన్నారు. తమ పాత కార్యాలయంలో వాటిని భద్రపరిచేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

నిర్వహణ అస్తవ్యస్తం


ఊరికి దూరంగా కోడూర్ గ్రామ రైతువేదిక

రైతు వేదికల నిధుల విడుదలలో జాప్యం

- భారంగా విద్యుత్ చార్జీలు, పారిశుద్ధ్య పనులు
- వీడియో కాన్ఫరెన్స్‌ల నిర్వహణతో అదనపు భారం
- సొంత డబ్బు ఖర్చు చేస్తున్న ఏఓ, ఏఈఓలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన రైతువేదికలు సమస్యలతో సతమతమవుతున్నాయి. 31 నెలలుగా ప్రభుత్వం నిర్వహణ నిధులు విడుదల చేయక వేదికలు నిస్తేజంగా మారాయి. కరెంట్ బిల్లులు, పారిశుద్ధ్య నిర్వహణ, స్టేషనరీ, తాగునీటి సౌకర్యాల కల్పనకు డబ్బులు లేక ఏఓలు, ఏఈఓలు ఇబ్బంది పడుతున్నారు. వీటి కోసం అధికారులు సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంతేకాకుండా రైతు వేదికల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో ఎప్పుడు కరెంట్ కట్ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యవసాయశాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలను నిర్మించింది. శాఖాపరంగా రైతులకు ఆధునిక సాగు విధానంపై సలహాలు, సూచనలు ఇవ్వాలనేది దీని ప్రధాన లక్ష్యం. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రైతు వేదికల నిర్వహణపై పట్టింపు లేకుండాపోయింది.

■ గత ప్రభుత్వం జిల్లాలో 86 రైతు వేదికలను నిర్మించేందుకు రూ.18.92 కోట్లు మంజూరు చేసింది. ఒక్కొక్క నిర్మాణానికి రూ.22 లక్షల వరకు ఖర్చు చేశారు. 150 నుంచి 200 మంది కూర్చునే సామర్థ్యంతో వేదికలను నిర్మించారు. టేబుళ్లు, కుర్చీలు, మైక్ సిస్టంతో పాటు ఇతర సామగ్రిని సమకూర్చింది. ఏఈఓ, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ కోసం రెండు గదులు, రైతుల సమావేశం కోసం ఒక మీటింగ్‌హాల్‌తో కూడిన రైతు వేదికలను నిర్మించారు. ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక ఏఈఓను నియమించి వారి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రైతు వేదికలను నిర్మించింది. ఒక్కో రైతువేదిక నిర్వహణ కోసం మొదట నెలకు రూ.3 వేలు ఇచ్చింది. ఈ నిధులు సరిపోకపోవడంతో వ్యవసాయశాఖ ప్రతిపాదనల మేరకు రైతు వేదికల నిర్వహణకు రూ.9 వేల చొప్పున అందజేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అయితే 2022 సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు ఒక్కపైసా విడుదల కాలేదు. 86 రైతు వేదికలకు సంబంధించి 31 నెలలకు నిర్వహణ నిధులు రూ.2,31,57,000 మేర పేరుకుపోయాయి. నిధులు విడుదల చేయకపోవడంతో విద్యుత్ చార్జీలు, పారిశుద్ధ్య నిర్వహణ, మరమ్మతులు, స్టేషనరీ, రైతు శిక్షణ, తాగునీటి సౌకర్యాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యవసాయ అధికారులు (ఏఓ), మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) వాపోతున్నారు. ఒక్కో రైతు వేదికకు రూ.2.79 లక్షలు రావాల్సి ఉందని, తమ సొంత డబ్బులను ఖర్చు చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఒక్కో వేదికకు రూ.10 వేల నుంచి రూ.12 వేల చొప్పున విద్యుత్ చార్జీలు బకాయిలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. ఒక్కో కేంద్రానికి మినీ భూసార పరీక్ష ల్యాబ్ కిట్లను అందజేసి వీటి ద్వారా వేదికల్లో పరీక్షలు చేయాల్సి ఉన్నా నిధులు లేకపోవడంతో ఈ ప్రక్రియ కూడా అటకెక్కింది.

■ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు సమావేశమై సాగు సమస్యలు, ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు వీలుగా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి విడతగా జిల్లాలోని 16 మండలాల పరిధిలో ఒక రైతు వేదికను వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ కోసం ఎంపిక చేశారు. ప్రతి మంగళవారం రైతునేస్తం నిర్వహిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా నెలల తరబడి నిధులు విడుదల చేయకపోతే ఈ కార్యక్రమాలను ఎలా నిర్వహిస్తామని ఏఈఓలు ప్రశ్నిస్తున్నారు.

7 కిలోమీటర్ల దూరంలో...



మాకు వ్యవసాయమే జీవనాధారం. మా గ్రామంలో రైతువేదిక లేదు. మా ఊరు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నచింతకుంటలో రైతువేదిక ఉంది. అక్కడికి గ్రామం నుంచి వెళ్లేందుకు రైతులెవరూ శ్రద్ధ చూపడం లేదు. అక్కడికి వెళ్లిన సరైన సూచనలు, సలహాలు అందడం లేదు.

– విష్ణుచారి,
అల్లీపూర్, చిన్నచింతకుంట మండలం

నిర్వహణ ఖర్చులు భరిస్తున్నాం



ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రైతువేదికల నిర్వహణ ఖర్చులను మేమే భరిస్తున్నాం. 2022 సంవత్సరం మొదట్లో కొంత నిర్వహణ ఖర్చులు మంజూరు చేసినప్పటికీ తర్వాత ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. రైతు వేదికలకు వచ్చే విద్యుత్ చార్జీలు మాత్రం ఏడీఏ కార్యాలయం నుంచి చెల్లిస్తున్నారు.

– రాజేందర్ అగర్వాల్,
మండల వ్యవసాయాధికారి, దేవరకద్ర

ప్రభుత్వానికి నివేదించాం



రైతులకు సాగులో సలహాలు, సూచనలు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు వేదికలను ఏర్పాటు చేసింది. కరెంట్ బిల్లు, స్టేషనరీ, తాగునీటి సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం మొదట్లో నిధులు విడుదల చేసింది. జిల్లాలోని 86 రైతు వేదికల నిర్వహణ నిధులు విడుదల కోసం ప్రభుత్వానికి నివేదించాం.

– బి.వెంకటేష్,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఊరికి దూరంగా...

ఒక్కో రైతు వేదిక పరిధిలో 5 వేల ఎకరాలు ఉండేలా 5–6 గ్రామాలను చేర్చారు. కానీ వీటిని ఊరికి దూరంగా నిర్మించడంతో రైతులు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రతి రైతు వేదికకు ఒక విస్తరణ అధికారి బాధ్యులుగా ఉండగా, వీరిలో 37 మంది మహిళలే ఉన్నారు. ఊరికి దూరంగా ఉన్న రైతు వేదికల్లో వీరు ఒక్కరే విధులు నిర్వర్తించేందుకు భయపడుతున్నారు. కనీసం అటెండర్ కూడా లేకపోవడంతో ఏఈఓనే తాళం తీసుకుని శుభ్రం చేసుకుని విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏఈఓలు తప్పనిసరిగా వారి క్లస్టర్ పరిధిలోని రైతువేదిక నుంచి జియో ట్యాగింగ్ ద్వారా తమ హాజరు నమోదు చేసుకోవాలి. ప్రతిరోజు విధిగా రైతు వేదికకు వెళ్లి హాజరునమోదు చేసుకున్న తర్వాతే క్షేత్రస్థాయికి వెళ్లాల్సి వస్తుంది. ■

అంబేడ్కర్ అందరివాడు


అంబేడ్కర్ కళాభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద అభివృద్ధి పనులు
- మహబూబ్‌నగర్ విద్యా నిధికి విశేషంగా ఆదరణ: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల ప్రజలు సమాన స్థాయికి వచ్చేంతవరకు రాజ్యాంగంలో ప్రత్యేకమైన వెసులుబాటు కల్పించారని చెప్పారు. అగ్రవర్ణాలు, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలు అందరూ ఈ రోజు సుఖసంతోషాలతో భారతదేశంలో ఉండగలుగుతున్నారంటే దానికి కారణం అంబేడ్కర్ చూపిన విధానం అని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలని, ఏ వర్గానికి కేటాయించిన బడ్జెట్‌ను ఆ వర్గానికే కేటాయించి వారి అభివృద్ధికి కార్యాచరణ ఉండాలని 100 శాతం ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని చెప్పారు. అందుకే కేవలం ఒక్క హన్వాడ మండలంలోనే రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా అభివృద్ధి పనులు చేస్తామని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ప్రతి తండాకు కూడా రోడ్డు వేస్తున్నామని అన్నారు. వచ్చే సంవత్సరంలోగా కచ్చితంగా మిగిలిన రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు అందరి సహకారం తనకు కావాలన్నారు. మీ పిల్లలను మంచిగా చదివించాలని, చదువుకుంటే భవిష్యత్ బంగారు మాయమవుతుందన్నారు. జనవరి నెలలో విద్యానిధి ఏర్పాటు చేశానని, వివిధ రంగాల వ్యక్తుల నుంచి దీనికి ఇప్పటికి రూ.50 లక్షల విరాళాలు వచ్చాయన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ కళాభవన్‌లో నిరుద్యోగులకు ఈ నెల 16 నుంచి ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డీడీ సుదర్శన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వకీల్ భీమయ్య, మల్లెపోగు శ్రీనివాస్, వెంకటేష్, సామెల్, యాదయ్య, రవికుమార్, చెన్నకేశవులు, శ్రీరాములు, బండారి రాములు, బాలపీరు, రఘునాథ్ పాల్గొన్నారు.


మిషన్ భగీరథ స్కీంలో వాటర్ ఫిల్టర్

దాహం తీరేనా..?!

శ్రీశైలం జలాశయంలో వేగంగా తగ్గుతున్న నీటిమట్టం

- మిషన్ భగీరథ అవసరాలకు కేఎల్ఐ ద్వారా ఎత్తిపోతలు
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూసేందుకు చర్యలు
- యాసంగి సీజన్ ముగియడంతో నిలిచిన సాగునీటి సరఫరా
- నార్లాపూర్ రిజర్వాయర్ నిర్మాణంతో లభించనున్న శాశ్వత పరిష్కారం

కొల్లాపూర్: శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవెల్స్ క్రమంగా తగ్గుతుండటంతో తాగునీటి అవసరాలపై అధికారులు దృష్టిసారించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు చేపట్టారు. ఇందుకోసం కేఎల్ఐ ప్రాజెక్టుకు అనుసంధానంగా కొల్లాపూర్ మండలం ఎల్లూరులో మిషన్ భగీరథ పంప్‌హౌజ్ నిర్మించారు. ఇక్కడి నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లా 3 నియోజకవర్గాల పరిధిలోని 84 మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకులు నిర్మించి నీటి సరఫరా చేస్తున్నారు. అయితే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తలెత్తకుండా చూస్తామని అధికారులు చెబుతున్నారు.

నీటి అవసరాలు తీర్చేలా...

మిషన్ భగీరథ పథకానికి రోజూ 0.2 టీఎంసీల నీళ్లు అవసరం. కేఎల్ఐ ప్రాజెక్టు పరిధిలోని ఎల్లూరు రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 0.36 టీఎంసీలు. ఒక్కసారి రిజర్వాయర్‌ను నింపితే దాదాపుగా 18 రోజులపాటు తాగునీటి అవసరాలు తీరుతాయి. ప్రస్తుతం శ్రీశైలం బ్యాక్ వాటర్ లెవెల్స్ ప్రకారం వేసవి పూర్తయ్యే వరకు నీటిని ఎత్తిపోసుకునే వీలుంది. తాగునీటి కేటాయింపుల ప్రకారమే శ్రీశైలం బ్యాక్ వాటర్ వినియోగం ఉంటుంది.

వచ్చే ఏడాది నుంచి..

ప్రతి సంవత్సరం తాగునీటి అవసరాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఎల్లూరు రిజర్వాయర్ సామర్థ్యం చిన్నది కావడంతో తాగునీటి సరఫరాపై ఆందోళనలు నెలకొంటున్నాయి. పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు జరిగితే తాగునీటి ఇక్కట్లు పూర్తిస్థాయిలో తీరుతాయి. నార్లాపూర్ రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 6 టీఎంసీలపైనే. ఒక్కసారి రిజర్వాయర్ నిండుగా ఉంచితే వేసవి మొత్తం మిషన్ భగీరథకు తాగునీరు అందుతుంది. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ పథకానికి నీటిని మళ్లించేందుకు వీలుగా రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి.

తగ్గుతున్న నీటిమట్టం..

వేసవి ప్రభావంతో శ్రీశైలంలో బ్యాక్ వాటర్ లెవెల్స్ వేగంగా పడిపోతున్నాయి. ప్రస్తుతం డ్యాంలో 818 అడుగుల వద్ద 38.86 టీఎంసీల నీరు ఉండగా.. మిషన్ భగీరథ కోసం 800 అడుగుల (37.0 టీఎంసీల డెడ్ స్టోరేజీ) వరకు నీటిని వినియోగించుకునే వెసులుబాటు ఉంది. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం తాగు, సాగునీటి అవసరాల కోసం నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటికే యాసంగి సీజన్ ముగియడంతో సాగునీటి సరఫరా నిలిపివేసి.. కేవలం తాగునీటి కోసమే ఎత్తిపోతలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

ప్రస్తుతం శ్రీశైలంలో ఉన్న నీరు (టీఎంసీలు)	జలాశయం డెడ్ స్టోరేజీ (టీఎంసీలు)
38.86	37.0
ఇందులో వాడుకునే అవకాశం ఉన్నది (టీఎంసీలు)	**మిషన్ భగీరథకు ప్రతిరోజు అవసరమైన నీరు (టీఎంసీలు)**
1.86	0.2


కేఎల్ఐ అప్రోచ్ కెనాల్‌లో కృష్ణా బ్యాక్‌వాటర్

తాగునీటి అవసరాలకే..



ప్రస్తుతం తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కేఎల్ఐ ప్రాజెక్టు వద్ద 818 అడుగుల మేరకు కృష్ణానదిలో బ్యాక్ వాటర్ ఉంది. 800 అడుగుల వరకు తాగునీటి అవసరాలకు నీటిని ఎత్తిపోసుకోవచ్చు. తాగునీటి అవసరాలను బట్టే ఎత్తిపోతలు సాగుతున్నాయి. కృష్ణానదిలో బ్యాక్ వాటర్ నిల్వలు, మిషన్ భగీరథ అవసరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథకు నీటిని మళ్లించేందుకు చేపట్టిన పనులు తుదిదశకు చేరాయి. ఈ పనులు పూర్తయితే తాగునీటి అవసరాలకు ఎప్పటికీ ఢోకా ఉండదు.

– అంజాద్ పాషా, డీఈఈ, మిషన్ భగీరథ

రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాజ్యాంగ ఫలాలు ప్రజలు అనుభవించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని కలెక్టర్ విజయేందిర అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించే హక్కులకు ఎవరు భంగం కల్పించవద్దని అన్నారు. ప్రపంచ దేశాల్లో రాజ్యాంగాలను పరిశీలించి అత్యంత ఉత్తమమైన రాజ్యాంగాన్ని మన దేశ ప్రజలకు అందించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు.

ప్రపంచ మేధావి: ఎంపీ డీకే అరుణ

అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం మాట్లాడుతూ ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా పని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అణగారిన వర్గాల ఆశా జ్యోతి అంబేడ్కర్ అని పేర్కొన్నారు.

'భూ భారతి'కి మద్దూరు ఎంపిక

- పైలెట్ ప్రాజెక్టుగా అందుబాటులోకి..
- పోర్టల్‌పై నేటి నుంచి అవగాహన సదస్సులు


మద్దూర్ తహసీల్దార్ కార్యాలయం

నారాయణపేట: వ్యవసాయ భూములకు సంబంధించి సమస్యల పరిష్కారం, భూ లావాదేవీలకు సంబంధించిన సమాచారం రైతులకు, ప్రజలకు సులభంగా, వేగంగా అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. మంగళవారం ఈ పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రారంభించగా.. రాష్ట్ర వ్యాప్తంగా మూడు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. అందులో సీఎం ఇలాఖా అయిన కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలాన్ని ఎంపిక చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద మద్దూరుమండలాన్ని ఎంపిక చేయడంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలం సూచనలతో తహసీల్దార్ మహేశ్ గౌడ్, అధికార యంత్రాంగం భూభారతిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. మంగళవారం నుంచి మండలంలో క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు భూ భారతిపై అవగాహన కల్పించనున్నారు. ప్రజల నుంచి వచ్చే సందేహాలు, సలహాలు, సూచనలు స్వీకరించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు.

■ మద్దూరు మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. చెన్వార్, చెన్నారెడ్డిపల్లి, చింతల్‌దిన్నె దమ్‌గస్‌పూర్ దొరెపల్లి, జాదరావ్‌పల్లి, ఖాజీపూర్, లక్కాయపల్లి, మద్దూర్, మల్కిజాదవ్‌రావ్‌పల్లి, మొమినాపూర్, నాగిరెడ్డిపల్లి, నందిపహడ్, పల్లెర్ల, పర్సపూర్, పెదరిపాడు, రేనివట్ల గ్రామాలు ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం మండలంలో 30,621 ఎకరాల భూమి ఉంది. డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండగా ఒక ఆర్ఐ, ఒకరు సర్వేయర్ విధుల్లో ఉన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన మద్దూరుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తూ రెవెన్యూ, సర్వేయర్లను నియమించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

పాలమూరులో ముస్లింల భారీ ర్యాలీ

- రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ చట్టం: టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్


తెలంగాణ చౌరస్తాలో ముస్లింల నిరసన ర్యాలీ

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జిల్లాకేంద్రంలో ముస్లింలు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కాలనీల నుంచి తరలివచ్చిన ముస్లింలు సమూహంగా ఏర్పడి క్లాక్ టవర్ నుంచి ర్యాలీని ప్రారంభించారు. వేలాది ముస్లింలతో ఈ నిరసన ర్యాలీ అశోక్‌టాకీస్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు నిర్వహించారు. ర్యాలీలో ప్లకార్డులతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు ఇచ్చినందుకు నిరసనగా సీఎంలు చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని కేంద్రం వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చిందని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులు అల్లా పేరిట ఉంటాయని, దీంట్లో కేంద్రం ప్రభుత్వం పెత్తనం ఎందుకని ప్రశ్నించారు. వక్ఫ్ సవరణ చట్టానికి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలువురు ముస్లిం పెద్దలు, సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన ర్యాలీల్లో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కురుమూర్తి, కిల్లె గోపాల్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, మోహన్, వామన్‌కుమార్‌తో పాటు ముస్లిం సంఘాల ప్రతినిధులు మోసీన్‌ఖాన్, తఖీ హుస్సేన్, ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షులు ఫారుఖ్ హుస్సేన్, ఖుద్దూస్ బేగ్, సిరాజ్‌ఖాద్రీ, మహ్మద్ తఖీ, అజ్మత్‌అలీ, అబ్దుల్ రహెమాన్, షబ్బీర్ అహ్మద్, హాఫిజ్ ఇద్రీస్, ఎండీ ఫయాజ్, ఎండి.అయాబ్, షేక్ ఫరీద్, సిరాజ్‌ఖాన్, నిజాముద్దీన్, అవేజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్య వదిలిపెట్టిందని.. భర్త ఆత్మహత్య

నవాబుపేట: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య వదిలిపెట్టిపోయిందని మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవాబుపేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నవాబుపేటకు చెందిన ఎండీ తాజ్ (30) మూడేళ్ల క్రితం శంషాబాద్‌లో ఐషా అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత నవాబుపేటలో తన భార్యతో కలిసి నివాసం ఉండే వాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొన్ని రోజుల క్రితం భర్తను వదిలిపెట్టి ఆమె వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన అతడు తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకునేందుకు ఇంట్లో ఫ్యాన్‌కు చీర కట్టి ఉరి వేసుకున్నాడు. అయితే చీర తెగిపోవటంతో అతడు కిందపడి తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు సాదిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్‌కు చెందిన మల్లెపల్లి అలివేల (40) తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో సహా అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. ఈ నెల 4న అలివేల తన భర్త హుస్సేన్‌తో గొడవపడి, పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. భర్త హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త..

మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లికి చెందిన ఒర్సు శ్రీను (39) తన ఆరేళ్ల కుమారుడితో సహా అదృశ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ నెల 12న ఇంట్లో అతడు గొడవపడి స్కూల్ నుంచి తన కుమారుడిని తీసుకెళ్లాడని.. వారి కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. శ్రీను భార్య జంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వెల్దండ: మండల కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్‌కు చెందిన రాజగోపాల్‌సింగ్(54) ఆదివారం సమీప బంధువుల సంబంధించి కేఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. రాత్రి హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై రోడ్డు దాటే క్రమంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహం అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తమ్ముడు రవీందర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: పేకాట ఆడుతున్న పలువురిని సోమవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల మండలంలోని పురుమాల శివారులో గుట్టుగా పేకాట ఆడుతున్నారన్నా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. దాడిలో కుర్వపల్లి, కొండపల్లి, పూడూరు ఎర్రవలి, మేలచెరువ్వు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన తిరుపతి, వెంకటేష్, నల్లన్న, చరణ్ తదితరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో నలుగురు పేకాటరాయుళ్లు రాముడు, పరశరాముడు, జమ్మన్న, పరుశురాముడు తప్పించుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారి వద్ద రూ. 15,050 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. పేకాట ఆడుతున్నారన్నా సమాచారం తెలిసిన వారు డయల్ 100 లేదా పోలీసు అధికారులకు సమాచారం అందిం.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- అక్కడికక్కడే డ్రైవర్, క్లీనర్ మృతి

మానవపాడు: మండలంలోని జల్లాపురం శివారు ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారి–44పై ఆగి ఉన్న లారీని వెనక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో డ్రైవర్, క్లీనర్ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి పసుపు లోడుతో కేరళకు వెళ్తున్న లారీ జల్లాపురం శివారులో ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ఆగి ఉంది. అదే సమయంలో షాద్‌నగర్ నుంచి ఏపీలోని ఆళ్లగడ్డకు వెళ్తున్న మరోలారీ వేగంగా వచ్చి అజాగ్రత్తగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనకాల నుంచి ఢీకొన్న లారీ డ్రైవర్, యజమాని హుస్సేన్‌బాషా(56), క్లీనర్ కదిరి వీరయ్య(58) అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురి మృతదేహాలను హైవే అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చెప్పారు.

రైతుల కష్టం నీటిపాలు

- అకాల వర్షంతో తడిసిన వడ్లు
- దేవరకద్ర మార్కెట్‌లో తడిసి ముద్దయిన 2వేల బస్తాల ధాన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం)/దేవరకద్ర/మిడ్జిల్/కల్వకుర్తి రూరల్/వెల్దండ: ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట వరుణుడి దెబ్బకు తడిసి ముద్దయింది. ఇది చూసిన రైతు అయ్యో వరుణదేవా ఏందీ పరిస్థితి అని గుండెలవిసేలా రోదిస్తున్నాడు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మరికొన్ని చోట్ల గాలి దుమారానికి చెట్లు నేలకొరిగాయి. దేవరకద్ర, మహబూబ్‌నగర్ రూరల్, కల్వకుర్తి, మిడ్జిల్, వెల్దండ మండలాల్లో కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. నాటు వేసినప్పటి నుంచి కోత కోసే దాక తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకుంటున్న పంట.. చేతికి వచ్చే సరికి అకాల వర్షాలతో దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

■ మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద కుప్పలుగా పోసిన వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. వర్షం పడే సమయానికి రైతులు అక్కడి చేరుకొని ధాన్యాన్ని కుప్పగా పోసినప్పటికీ.. కప్పడానికి సరైనా టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పాయిపల్లి, మాచన్‌పల్లి, ఓబ్లాయిపల్లి, తండా, రామచంద్రాపూర్, కోడూర్, తెలుగుగూడెం తదితర గ్రామాల్లో వడగండ్లు పడటంతో వరిపంటలు దెబ్బతిన్నాయి. గాలివాన కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

■ మిడ్జిల్ మండలం మిడ్జిల్, వాడ్యాల్, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిల్వేర్ గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. 50 నుంచి 65శాతం మేర వడ్లు నేలరాలినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

■ కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో 15 మంది రైతులకు చెందిన 40 ఎకరాల వరిపంట దెబ్బతింది. అకాల వర్షానికి వరిపంట దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు.



మన్యంకొండ చౌరస్తాలో నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతులు

■ దేవరకద్ర మార్కెట్‌యార్డులో రెండు రోజుల క్రితం ఆరబోసిన 2వేల బస్తాల ధాన్యం తడిసి ముద్దయింది. మార్కెట్‌కు రెండు రోజులపాటు సెలవు కారణంగా లావాదేవీలు జరగడం లేదు. మంగళవారం మార్కెట్‌లో ధాన్యాన్ని విక్రయించవచ్చని కొందరు, కొనుగోలు కేంద్రం ప్రారంభమైతే మద్దతు ధరకు అమ్ముకోవచ్చని మరికొందరు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోగా.. అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అదే విధంగా దేవరకద్ర సమీపంలోని అమ్మాపూర్ రోడ్డులో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. కల్లాలు లేక పోవడం వల్ల పలువురు రైతులు దేవస్థానం పొలంలో ఆరబెట్టుకుంటుండగా.. అకాల వర్షానికి ధాన్యం తడిసి పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.



దేవరకద్ర మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని చూసి ఆందోళన చెందుతున్న రైతు

■ వెల్దండ మండలంలోని చొక్కన్నపల్లి, కుందారంతండా, బండోనిపల్లి తదితర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వర్షంతో పాటు ఈదురుగాలుల దుమారంతో కుందారంతండాలో విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు నేలకొరిగి ఇళ్లపై పడ్డాయి. పలువురి ఇళ్ల సిమెంట్ రేకులు ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు. బండోనిపల్లిలో పిడుగుపాటుకు గురై రైతు వావిళ్ల పర్వతాలు అస్వస్థతకు గురయ్యారు.



వెల్దండలో గాలివానకు విగిరిపడిన చెట్లు



మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లిలో నేలరాలిన వడ్లు

> **ఎడెకరాల్లో పంట దెబ్బతింది..**
>
> 
>
> ఎడెకరాల్లో సాగుచేసిన వరిపంట మొత్తం దెబ్బతింది. వడగండ్ల వానకు వడ్లు నేలరాలడంతో 70శాతం వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.
>
> – నర్సింహారెడ్డి, రైతు, అయ్యవారిపల్లి, మిడ్జిల్ మండలం

> **400 బస్తాల ధాన్యం తడిసింది..**
>
> 
>
> మద్దతు ధరకు అమ్ముకోవాలని 400 బస్తాల ధాన్యాన్ని మార్కెట్‌లోని సీసీరోడ్డుపై ఆరబోశాను. అకాల వర్షంతో ధాన్యం అంతా తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రంలో అయితే మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుందని ఆశ పడగా.. ధాన్యం అంతా నీటి పాలు అయింది.
>
> – వర్కుటి లక్ష్మారెడ్డి, రైతు, దేవరకద్ర

> **కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి..**
>
> 
>
> కొనుగోలు కేంద్రం ప్రారంభం అవుతుందని చెప్పడంతో రెండు రోజుల నుంచి మార్కెట్ ఆవరణలో 300 బస్తాల ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న. మార్కెట్‌లో అమ్మితే రూ. వెయ్యి వరకు తక్కువ ధర వస్తుంది. అదే కొనుగోలు కేంద్రంలో అయితే మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుందని ఎదురుచూస్తున్నా. అకాల వర్షంతో ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది.
>
> – బండ కొండారెడ్డి, రైతు, దేవరకద్ర

> **కుప్పగా పోసేందుకు కూడా సమయం లేదు..**
>
> 
>
> ఆరబెట్టుకున్న ధాన్యం కళ్లెదుటే తడిసిపోయింది. కనీసం కుప్పగా పోసుకోడానికి కూడా సమయం దొరకలేదు. భారీ వర్షానికి 600 బస్తాల ధాన్యం తడిసిపోగా.. మరికొంత నీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇలా నీటిపాలు అవుతుంటే చూస్తున్న తప్ప రక్షించుకునే పరిస్థితి కనిపించలేదు. అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.
>
> – డోకూర్ హన్మిరెడ్డి, రైతు, దేవరకద్ర

దేవరకద్ర మార్కెట్‌లో వర్షంలో తడుస్తున్న ఆరబెట్టిన ధాన్యం



ఎకరాకు రూ. 30వేల పరిహారం ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యంతో పాటు దెబ్బతిన్న పంటలను బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. కోడూర్, తెలుగుగూడెం, అప్పాయిపల్లి, ఓబ్లాయిపల్లి, తండా, కోటకదిర, మాచన్‌పల్లి గ్రామాల్లో అకాల వర్షంతో రైతులకు అపారనష్టం చేకూరిందని.. ఎకరాకు రూ. 30వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ పి.రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, వెంకటస్వామి, మస్తాన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఓబ్లాయిపల్లిలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముమ్మరంగా సహాయక చర్యలు



సొరంగం వద్ద సహాయక బృందాలతో ప్రత్యేకాధికారి

- ఎస్‌ఎల్‌బీసీలో 52 రోజులుగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
- నిపుణుల సూచన మేరకు డి–1 ప్రదేశంలో తవ్వకాలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగి సోమవారం నాటికి 52 రోజులు గడుస్తోంది. డి–1 ప్రదేశంలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా నిపుణుల సూచనలు, సలహాల మేరకు అత్యాధునిక సాంకేతిక పరికరాలు వినియోగించి మట్టి తవ్వకాలు, టీబీఎం శకలాల తొలగింపు చేపడుతున్నారు. ఐదు ఎస్కవేటర్లు నిరంతరాయంగా మట్టి తవ్వుతుండగా.. కన్వేయర్ బెల్టుపై సొరంగం నుంచి బయటకు తరలిస్తున్నారు. సిబ్బందికి ఆక్సిజన్ అందించేందుకు వెంటిలేషన్ వ్యవస్థ పునరుద్ధరణ కొనసాగుతోంది. సొరంగంలో నిరంతరాయంగా ఉబికి వస్తున్న నీటిని భారీ మోటార్ల సాయంతో బయటకు తరలిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12 సంస్థల 560 మంది సిబ్బంది రాత్రింబవళ్లు గల్లంతైన ఆరుగురి ఆచూకీ గుర్తించేందుకు శ్రమిస్తున్నా.. ఇంతవరకు దొరకలేదు. షిఫ్టులలో 560 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

వెంటిలేషన్ వ్యవస్థ పునరుద్ధరణ..

సొరంగం ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్నామని, సిబ్బందికి అవసరమైన ఆక్సిజన్ అందించేందుకు వెంటిలేషన్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. సోమవారం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లెట్ జేపీ కార్యాలయం వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీవాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, నీటిని కృష్ణానదిలోకి వదులుతున్నట్లు తెలిపారు. సహాయక బృందాల భద్రతకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, సిబ్బంది నిర్విరామంగా పని చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్ట్ ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కన్వేయర్ బెల్టుపై మట్టి వేస్తున్న ఎస్కవేటర్లు

మహిళపై మత్తు మందు చల్లి.. నంచర్లలో భారీ చోరీ



నంచర్లలో చోరీకి గురైన ఇల్లు, దుకాణం

మహమ్మదాబాద్: మహిళపై మత్తు మందు చల్లి పట్టపగలే చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని నంచర్లలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబం కథనం ప్రకారం.. నంచర్లకు చెందిన శివగోపాల్ ఇంట్లోనే కిరాణం దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం తన కోడలిని దుకాణంలో కూర్చోబెట్టి పనిమీద బయటకు వెళ్లాడు. అయితే రెక్కీ నిర్వహించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం దుకాణానికి వచ్చి సదరు మహిళను వాటర్ బాటిల్ అడిగారు. ఆమె వాటర్ బాటిల్ తీసుకువచ్చి ఇవ్వబోగా ఆమె ముఖంపై మత్తుమందు చల్లారు. దీంతో స్పృహతప్పి పడిపోయిన మహిళను ఇంట్లోకి తీసుకెళ్లి పడుకోబెట్టి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు నగలు, బీరువాలో దాచిన రూ.6 లక్షల నగదు, 12 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. మొత్తం దాదాపు రూ.20 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైనట్లు బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చిన యజమాని శివగోపాల్ జరిగిందంతా చూసి పోలీసులకు సమాచారం అందించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ

నంచర్లలో పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకున్న మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్, మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో కుటుంబీకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు, దొంగలు ఉపయోగించిన పరికరాలు ఏమైనా ఉన్నాయా.. మత్తు ఎలా చల్లారు.. దుకాణంలో ఏమైనా ఆధారాలు ఉన్నాయా అన్న కోణంలో పరిశీలించారు. దొంగలు ముందే రెక్కీ నిర్వహించి ఇలాంటి ఘటనకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తెలిసిన వారెవరైనా ఇలాంటి ఘటనకు పాల్పడ్డారా అన్న కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. బాధితుడు శివగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి ఇద్దరి గల్లంతు



మృతదేహాల కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

రాజాపూర్ (బాలానగర్): చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు గల్లంతైన ఘటన సోమవారం బాలానగర్ మండలం మోతీఘనపూర్ పెద్దచెరువులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాలానగర్ మండలం గంగాధర్‌పల్లికి చెందిన శివరాములు (45) గ్రామ శివారులోని పెద్ద చెరువులో పడిపోయాడు. గుర్తించిన యాదయ్య (25) శివరాములు కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడకు చేరుకున్నారు. తీసుకొస్తానంటూ యాదయ్య కూడా చెరువులోకి దిగగా.. ఈత రాకపోవడంతో ఆయన కూడా చెరువులో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు ప్రారంభించినా.. రాత్రి వరకు ఆచూకీ లభించలేదు.

క్రికెట్ బెట్టింగ్ మాయ

రూ.1.05కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన విద్యార్థి

జడ్చర్ల: బెట్టింగ్ యాప్‌లో పందాలు కాసిన ఓ విద్యార్థి చివరకు రూ. 1.05కోట్ల అప్పులపాలైన ఘటన జడ్చర్లలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి కుమారుడు (ఇంజినీరింగ్ విద్యార్థి) ఓ యాప్‌లో క్రికెట్‌కు సంబంధించి బెట్టింగ్ కాశాడు. అయితే బెట్టింగ్ యాప్‌లో వచ్చిన లోన్ అప్లికేషన్‌ను పూర్తిచేసి.. ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా తదితర వివరాలను పొందుపరిచి, వారిచ్చిన నిబంధనలకు అంగీకారం తెలిపారు. దీంతో విద్యార్థి అనుకున్నంత లోన్ మంజూరు కావడం.. మంజూరైన డబ్బులతో బెట్టింగ్ కాయడం జరిగింది. తీరా బెట్టింగ్ పూర్తయ్యే సరికి సదరు విద్యార్థికి రూ. 1.05కోట్ల అప్పులు మిగిలాయి. ఈ అప్పునకు రూ.30 నుంచి రూ.40 వరకు వడ్డీగా ఉంది. తీసుకున్న అప్పు తీర్చకపోవడంతో ఇటీవల వారు విద్యార్థి ఇంటికి వచ్చి నానాయాగి చేశారు. అయితే పరువు కలిగిన ఆ కుటుంబ సభ్యులు తమ కుల సంఘం నాయకుడి ద్వారా మధ్యవర్తిత్వం నెరిపి చివరకు సెటిల్‌మెంట్ చేసుకున్నారు. అప్పులవాళ్లు ఇచ్చిన రూ. 1.05 కోట్లను వడ్డీ లేకుండా చెల్లించే విధంగా ఒప్పందం కుదర్చుకున్నట్లు తెలిసింది. ఇలా.. పట్టణంలో బెట్టింగ్ యాప్‌ల వలలో పడి పలువురు యువకులు రూ. కోట్ల అప్పుల్లో కూరుకుపోయినట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి సైబర్ నేరాలతో పాటు బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బావాజీని దర్శించుకున్న ప్రముఖులు



ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



కాళికాదేవిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కొత్తపల్లి: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలిసిన గురులోకమాసంద్ ప్రభు బావాజీ బ్రహ్మోత్సవాలకు సోమవారం మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. లోకమాసంద్ ప్రభు బావాజీ, కాళికాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు వారికి పుష్పగుచ్ఛాలు అందేజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద గిరిజన జాతర లోకమాసంద్ ప్రభు బావాజీని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల భక్తులు తరలివస్తారని.. రాష్ట్ర ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయాన్ని విస్మరించారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శాసం రామకృష్ణ, సలీం, గోపాల్, మధుసూదన్‌రెడ్డి, వీరారెడ్డి, రాజురెడ్డి, నెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బావాజీ ఉత్సవాలు

కొత్తపల్లి: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న బావాజీ ఉత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. సోమవారం చివరిరోజు ఉదయం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.



బావాజీని దర్శించుకుంటున్న ఎంపీ డీకే అరుణ

అలాగే అమ్మవారైన కాళికాదేవికి కొందరు భక్తులు మేకపోతులు, గొర్రె పొట్టేళ్లు, కోళ్ల బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారులు చందర్‌నాయక్, భీమ్లానాయక్, దేవ్లానాయక్, ధన్‌సింగ్ కాళికామాతకు మహా హోమం జరిపారు. గురులోకా మసంద్ బావాజీ, కాళికామాతను సోమవారం సాయంత్రం ఎంపీ డీకే అరుణ దర్శించుకున్నారు. ఎంపీగా గెలుపొందిన తర్వాత మొదటిసారి వచ్చిన ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆమె వెంట నారాయణపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్యయాదవ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, మదన్, సుధాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



రంగాపూర్ శివారులో ఆంజనేయులుతో పోలీసులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామ శివారు వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వ్యక్తిని కాపాడి ఆస్పత్రిలో చేర్పించినట్లు ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. పెబ్బేరు మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు కుటుంబ సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి గ్రామానికి సంబంధించిన ఓ వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో అతని మొబైల్ లొకేషన్ ఆధారంగా పోలీస్ సిబ్బంది వెంకట్రాములు, రామణ్‌గౌడ్‌తో కలిసి రంగాపురం శివారులోని వ్యవసాయ పొలంలో గుర్తించి అడ్డుకొని ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. సరైన సమయంలో స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు. చాలని పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

■ ఫామ్ హౌస్‌లో పనిచేయుటకు వ్యవసాయం తెలిసిన భార్యాభర్తలు కావలెను. రూమ్ ఇవ్వబడును. కల్వకుర్తి గట్టు ఇప్పలపల్లి నెలకు జీతం 15వేలు. 7382532031

భవిత విద్యార్థుల కోసం



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించవలసిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్